# 15

# పూలగుత్తి

"అమ్మా..."

"ఊ..." నీ గోలేమిటో నాకు తెల్సులే అన్నట్టుగా ఉంది మంగమ్మ చూపు. తల్లి పక్కనే నడుస్తున్న గౌరి ఎదురుగా కనిపిస్తున్న కొట్టు వైపు చూపించింది. చిరాకు పడిందా తల్లి "ఏంటంటావే? ఏం చేసుకుందావని? మనకి దేనికన్నా పనికొచ్చేవా పాడా?"

"ఒక్కటికొనియ్యే అమ్మా... ఎంత బాగున్నాయో..."

"మతిపోయిందే నీకు... ఆ కట్టేం చేసుకుంటవ్? నెత్తిలో దోపుకుంటావా?" గౌరి నెత్తిమీద ఓ పోటు పొడిచింది.

"ఇంట్లో పెడతానే..."

"ఓ యబ్బో... మనిల్లు బవనం కదూ?"

"ఒక్కసారి కొనియ్యి... ఇంకెప్పుడడగనే..."

"పిచ్చిపట్టిందే నీకు... నడు నడు... అయి మనలాటోల్లు కొనేయి కాదు".

రోజూ తన తల్లితో కలిసి ఇళ్ళల్లో పన్లు చెయ్యడానికి వెళ్తుంది గౌరి. వెళ్ళేటప్పుడు దోవలో ఫ్లవర్ బొకేలమ్మే కొట్టుముందు తరచుగా వాళ్ళిద్దరి మధ్య జరిగే సంభాషణే ఇది.

గౌరికి పూలంటే ప్రాణం. కానీ జడ అల్లుకునేంత జుట్టు ఎప్పుడూ ఉంచదు మంగమ్మ. జడవేస్తే దానికి రకరకాల రంగు రంగుల రబ్బరు బ్యాండులనీ... పువ్వులనీ... కుచ్చులనీ ఎన్నెన్నో కొనమంటుందనీ... ఎంతో ఖర్చు ఉంటుందనీ... ఆ ఖర్చు తప్పించుకోడానికి... ఎప్పటికప్పుడు కూతురికి క్రాఫ్ లాగా జుట్టు కత్తిరించి పడేస్తూ ఉంటుంది మంగమ్మ.

ముగ్గురాడపిల్లల తల్లి ఆమె... మూడో కూతురు చంటిపిల్లప్పుడే భర్తపోయాడు. గౌరి పెద్దకూతురు... పదమూడేళ్ళిప్పుడు. ఇంకో రెండేళ్ళు ఎక్కువలా కనిపిస్తుంది. అరడజను ఇళ్ళల్లో పన్లు చేస్తూ... ఇల్లు జాగ్రత్తగా నడుపుకుంటూ... పొదుపుగానే ఉంటుంది మంగమ్మ.

చిన్నపిల్ల అయినా గౌరి కూడా బాధ్యతగానే ఉంటుంది. పూల బోకేలు చూసినప్పుడు మాత్రం పువ్వులాంటి దాని మనసు సున్నితంగా స్పందించి పులకించి పోతుంది.

ఒక్కసారి... ఒక్కసారంటే ఒక్కసారి... ఒకటికొనుక్కుని ఇంట్లో ఏ గ్లాసులోనో నీళ్ళు పోసి పెట్టుకుని చూసి ఆనందించాలన్న ఉబలాటం ఆ పిల్లది. అది కూడా తనకి బాగా నచ్చిన రంగుల పూలగుత్తి కొనుక్కోవాలన్న ఆశ. దాని ఖరీదు యాభైరూపాయలన్నాడు.

"ఏం మంగమ్మా... నేను అడిగినదానికి ఏమీ చెప్పనే లేదు నువ్వు... ఏమాలోచించుకున్నావు?" ఎదురుగా వస్తున్న భాగ్యమ్మగారు పలకరించడంతో ఆగింది మంగమ్మ.

ఇంకెవరింట్లోనూ పన్లు చెయ్యకుండా తమ ఒక్క ఇంట్లోనే పన్లు చేస్తూ అక్కడే ఉండిపోయేలా గౌరిని పంపించమని అడిగిందావిడ.

అది తనకి సాయంగా లేకపోతే... ఇంట్లోనూ బయటా తన ఒక్కదానివల్లా అయ్యేనా? అందుకే మాట్లాడక ఊరుకుంది. ఇప్పుడు ఎదురుపడి అడిగితే చెప్పక తప్పదు మరి.

అలా వీలు పడదమ్మా అని చెప్పేసరికి ఏదేదో సణుక్కుంటూ విసవిసా వెళ్ళిపోయిందావిడ.

"ఏంటే అమ్మా... ఏవని అడిగిందే ఆవిడ?" గౌరి కళ్ళల్లో కుతూహలం. జవాబు చెప్పింది మంగమ్మ.

"అమ్మో! నే పోను. మనింటోనే ఉంటానే అమ్మా!"

"అట్టాగే లేవే. నిన్ను ఆళ్ళింటో పెట్టానంటే నన్నూ ఆ అమ్మగార్నీ కూడా పోలీసులు పట్టుకుపోతారు".

"ఎందుకూ?" ఆ గొంతులో ఎంత ఆశ్చర్యమో?

"చిన్న పిల్లల్ని పన్లో పెట్టకూడదంటలే"

"మరి... మరీ... నేను ఇంటిపనే కాదు... నువ్వు పోయే చోటికల్ల వస్తూనే ఉన్న కద?"

"నాతో పాటు ఎంట బెట్టుకుపోతే నువ్వెంత పనిజేసిన ఏం కాదు..."

ఈ సమాధానం దానికి నచ్చినట్టులేదు.

నడుస్తూనే మాటిమాటికీ తల్లి మొహంలోకి చూస్తోంది. హఠాత్తుగా అంది "అయితే నువ్వు తప్పుచేస్తున్నావు".

"చాల్లే... నన్నే తప్పులెంచుతావే?" ఉరిమినట్టు చూసింది.

పన్లకి పెట్టనే కూడదని అమ్మకి తెలుసు... చేయించుకోరాదని ఆ అమ్మగార్లకి తెలుసు. ఇద్దరూ తప్పులు చేసినా ఇంతే అన్నమాట... ఎప్పుడన్న... ఏ పోలీసైనా పట్టుకుంటే అమ్మని?... ఈ ఆలోచనతో భయం భయంగా అమ్మని గట్టిగా పట్టుకుని అడుగులు వేసింది గౌరి.

వింతగా చూసింది మంగమ్మ... "ఏవైనాది?"

ఏం లేదన్నట్టుగా తల ఊపింది.

అమ్మమ్మ ఇంటిముందు ఇసక కుప్పల్లో ఆడుకుంటూ ఉండమని వదిలేసి వచ్చిన చెల్లెళ్ళు ఇద్దరూ కళ్ళముందు మెదిలారు దానికి.

తను కూడా వాళ్ళకి మల్లే అక్కడ ఆడుకుంటూ ఉంటే ఎంత బావుండునని పించింది కాసేపు.

రోజూ బడికి పోయి చదువుకుంటే మరింత బావుంటుంది కదా అని అనిపించింది ఆ వెంటనే.

రెండిట్లో ఏదీ జరిగేది కాదని దిగాలు పడింది మనసు.

మళ్ళీ అమ్మ మొహంలోకి చూస్తూ జాలిపడుతూ అనుకుంది... ఇల్లు గడవడానికి అమ్మెంత పాటుపడుతోందో తెల్సి కూడా యాభైరూపాయిలు పోసి పూలగుత్తి కొనమని తను అడగడం తప్పు కాదా?

చిన్నపిల్లే అయినా పెద్ద మనసుతో ఆలోచించుకుంది.

✧ ✧ ✧

ఓ రోజు మంగమ్మ కిర్సనాయిలు తెచ్చుకుందుకు పోయినప్పుడు గౌరి దగ్గరికి చేరింది రత్తాలు. ఆమెతో ఎప్పుడూ మాట్లాడదు మంగమ్మ. వెనకవీధిలోనే ఉంటుంది. వాళ్ళింటి గుమ్మంలోకి కూడా వెళ్ళదు. తనంటే మంగమ్మకి ఇష్టంలేదని రత్తాలుకీ తెలుసు. ఏమీ తెలియని పిల్ల గౌరే... ఎప్పుడైనా రోడ్డుమీద తనెక్కడికైనా ఒంటరిగా వెళ్తున్నప్పుడు రత్తాలు ఎదురుపడి పలుకరిస్తే అత్తా అంటూ మామూలుగానే మాట్లాడుతుంది గౌరి. కానీ తమ ఇంటివైపు రావడం ప్రత్యేకం తనతో మాట్లాడటానికి రావడం ఆ పిల్లకి కొత్తగా ఉంది.

"ఒసే! గౌరీ! మీ అమ్మతో పన్లకి పోతూ కష్టంపడిపోతున్నావు కదే... నిన్నూ మీ అమ్మని చూస్తే జాలేసిపోతా ఉంది. తేలిగ్గా డబ్బు సంపాయించే పనిలో పెడతా చేసుకోరాదూ?"

"ఏం పనత్తా?"

"రోజూ చేతిలో పైసలు గల గల్లాడతయి. మీ అమ్మని సుకపెట్టొచ్చు నువ్వు..." అమ్మని సుకపెట్టడం అన్నమాట వినగానే ఆసక్తిగా చూసింది గౌరి.

"అమ్మ నవ్వుతా సుకంగా ఉండాలి... చెప్పత్తా... నేనెక్కువ డబ్బు సంపాయించే దారేదో చెప్పు" అమాయకంగా అడిగింది.

"చెప్తా... చెప్తా... నువ్వు ఎక్కడికో పోయేందుకు బైల్దేరినట్టున్నవే?"

"మా పిన్నమ్మ ఇంట్లో గోరింటాకు తెచ్చుకుందమని బైల్దేరిన.."

"సరే పోతా మాటాడుకుందం పద... నేనూ అటే పోవాల".

"అసలు... పనేంటో చెప్పినావు కాదు" మళ్ళీ గుర్తు చేసింది గౌరి.

"నీకు మంచి మంచి బట్టలు పవుడర్లు కడుపునిండా తిండి అన్నీ దొరికేందుకు సరిపడా డబ్బులొస్తయి. ఆ గంగ... సుబ్బి... రావులమ్మల్ని చూస్తానే ఉంటావుగా... ఎంత యిలాసంగా ఆనందంగా ఉంటారో... ఆళ్ళనీ నేనే పన్లో పెట్టినా. ఆ పనికి నువ్వొప్పుకుంటే నీ ఇంట్లో బంగారం కురుస్తాది".

ఒక్క నిముషం ఆ గంగ... సుబ్బి... రావులమ్మ కళ్ళముందు కనిపించారు గౌరికి... ఖరీదైన మంచి మంచి సిల్కు లంగాలు వోణీలు... చేతులకి మెడలోనూ రకరకాల మ్యాచింగుల గాజులు గొలుసులు జడలో ఇన్నేసి పూలతో రోజుకో రకంగా అలంకరణలు చేసుకుని వయ్యారంగా వాళ్ళు పోతుంటే ఒకరోజు అమ్మని అడగనే అడిగింది తను...

"వాళ్ళ అమ్మలు నీకంటే ఎక్కువ ఇళ్ళల్లో పన్లు చెయ్యడం లేదు కదమ్మా చక్కగా ఎన్నెన్ని కొని పెడతా ఉన్నారు అయినా కూడా..." అని. ఆళ్ళ సంగతి మనకెందుకు? మనసంగతి మనం చూసుకోవాలి... ఇంకోసారెప్పుడూ ఆ మాట మాటాడకే అనేసింది అమ్మ. ఇప్పుడీ అత్తేమో ఆళ్ళ గురించే చెప్తా ఉందే! యిసిత్రంగా ఉంది.

"ఆ పక్క యీదిలోకి ఓసారి పోయొద్దాం. తర్వాత మీ పిన్నమ్మ ఇంటికి పోదువు గాన్లే..."

"ఎవురింటికి అత్తమ్మా?" తన చెయ్యి పట్టి లాక్కుపోతుంటే కంగారుగా అడిగింది.

జవాబివ్వడం ముఖ్యం కాదన్నట్టు మాట్లాడకుండా గౌరిని ఓ డాబా ఇంట్లోకి గబగబా తీసికెళ్ళింది.

ఆ ఇంట్లో ముందు గదిలో కూచునున్న బుర్రమీసాలాయన్ని చూస్తూనే బెదిరిపోయింది గౌరి.

ఆయనకి దగ్గరగా వెళ్ళి చాలా నెమ్మదిగా ఏదో మాట్లాడింది రత్తాలు. ఇద్దరూ మాట్లాడుకోడం అయ్యాక గౌరికి దగ్గిరగా వచ్చి చెవిలో చెప్పినట్టు చెప్పింది.

"వచ్చినప్పుడల్లా వందరూపాయిలు ఇస్తారంట. నాలుగు రోజులు నేను నీ కూడా వస్తాలే... బయంలేదు... తరవాత నీకే అలవాటైపోతది. మీ అమ్మకిప్పుడే తెలిసే అవుసరవే లేదు. చెప్పొద్దు".

ఆ డబ్బుకి... అలంకరించుకోడాలకి... బిర్యానీ ప్యాకెట్లకి అలవాటు పడిపోతే అప్పుడు తల్లికి ఈ పిల్లా బయపడదు... ఈ పిల్ల సంపాదన ఆ తల్లీ వద్దనదు... ఇదీ రత్తాలు ఆలోచన...

"ఇక్కడ పనేం చెయ్యాల?"

"ఇక్కడ నువ్వు చేసే పనేం లేదు. నువ్వొచ్చినాక ఈ అయ్య నిన్ను జాగరతగా ఇంకో చోటికి పంపిస్తారంట. అక్కడయ్యగారేం చెపితే అది చెయ్యి... చాలు... మళ్ళా నిన్ను జాగరతగా ఇక్కడనే దిగవిడుస్తారు".

ఏదో ఇక్కడా అక్కడా పన్లు చేసుకుని డబ్బు సంపాదించుకుంటున్నట్టు నలుగురికీ కనపడుతుంది గానీ రత్తాలు అసలు వ్యాపారం ఆడపిల్లల్ని ఉచ్చులోకి లాగి రొచ్చులో దింపడమే.

ఇక్కడ పన్లో చేరినట్టు అమ్మకెందుకు చెప్పకూడదూ?... అర్థం కాలేదు గౌరికి.

"అమ్మతో పనికి పోవద్దామరి?" అనుమానంగా చూసింది.

"మామూలుగానే మీ అమ్మతో పనికి పోతా ఉండు. పనికి పోని టయాములో నువ్వెటు పోయి తిరగినా మీ అమ్మ ఏవనదు గదా? అప్పుడు నా దగ్గరికి రావాల" వస్తావు కదా అన్నట్టుగా చూసింది నవ్వుతూ.

గౌరికేదో అనుమానంగా మాత్రమే కాదు... భయంగా కూడా అనిపించింది.

"నే పోతన్నా..." అంటూ వడి వడిగా గుమ్మం దగ్గరికి చేరుకుంది.

"ఏంటే ఆ కంగారు... ఒక్క అంగలో వచ్చి గౌరి చెయ్యి పుచ్చుకుని ఓ యాభైనోటు ఆ చేతిలో కుక్కింది రత్తాలు.

చేయి పుచ్చుకున్న తీరు... ఆ వంకర నవ్వు... అదోలాంటి చూపు అన్నీ కూడా వణుకు పుట్టించాయి గౌరికి.

"ఊరికే ఎవరి దగ్గిరా పైసలు తీసుకోవద్దని మా అమ్మ చెప్పింది. నా కొద్దు..."

గోడవారగా ఉన్న ప్లాస్టిక్ కుర్చీలో ఆ నోటు పెట్టేసి బయటపడింది. సరిగ్గా అప్పుడే గేటు దగ్గర ఒక ఆటో ఆగడం అందులోంచి గంగ, సుబ్బి ఇద్దరు మొగవాళ్ళు దిగడం కంటపడింది. వాళ్ళూ గౌరిని చూశారు.

"నువ్వు కూడానా?" అంటూ వచ్చి గౌరి చెయ్యి పట్టుకుని ఇంత మొహం చేసుకుని సంబరంగా అడిగింది సుబ్బి.

"అంటే?"

"ఓ యబ్బో! ఎరగనట్టు మాటాడతావే! ఇక్కడి కొచ్చావుగా మరీ..."

"మా పిన్నమ్మ ఇంటికి పోతుంటే ఓసారిటుపోయొద్దాం అంటూ ఆ అత్త తీసుకొచ్చిందే నన్ను. నాకు బయంపుట్టింది... అందుకే పోతన్నా..."

"బయం ఎందుకూ?"

"ఇప్పుడు మీ వంక చూసినా బెదురుగానే అనిపిస్తాంది".

ఆ మాటతో తుళ్ళిపడి ఒకరిమొహాలొకరు చూసుకున్నారు వాళ్ళిద్దరూ.

ఇంకేమీ మాట్లాడకుండా ఇంటిదారిపట్టింది గౌరి.

గంగ భుజమ్మీద చెయ్యేసి మెల్లిగా అడిగింది సుబ్బి "మనల్ని చూస్తే బయం వేస్తా ఉందని ఎందుకన్నాదంటావ్ ఆ గౌరి?"

"ఆ... మనకంటే చిన్నపిల్ల కాదా? రౌడీల్లాంటోళ్ళతో మనం కనపడితే బయపడదా?"

"అంతేనా?... లేకుంటే... మనవంటే అసయ్యంతో ఆ మాట అన్నాదా?"

"అదికాదే గంగా... అది చిన్నపిల్లయినా ఆ మాట అంటా ఉన్నప్పుడు నాకేదో ఎచ్చరికలా అనిపించినాది".

"చాల్లే ఊరుకో... దాని వొయసు ఎంతా? నీకూ నాకూ ఎచ్చరిక చేసేపాటిదా అది? నీకు మతిగానీ పోయిందా?" చిరాగ్గా చూసింది గంగ.

మరేమీ అనలేకపోయింది సుబ్బి. కానీ... ఎందుకో తెలియకుండానే గౌరి మాటలు దాని మనసులో కలత రేపిన మాట నిజం.

✧ ✧ ✧

వేళకాని వేళలో పరిగెత్తుకొచ్చింది సుబ్బి. ఇంటి వెనకవైపు చెట్టుకిందకి రమ్మని పిల్చింది గంగని. ఆయాసపడుతూనే గబగబా చెప్పింది.

"ఆ సుమతి తెల్సుగా... మనకంటే ముందు జేరింది రత్తాలు దగ్గిర... దాన్ని ఎక్కడికోరమ్మంటే రాత్రి... రాలేనని అందంట. దాంతో కోపం వచ్చి ఒళ్ళు కొవ్వెక్కిందా

అంటానే గొంతు గట్టిగా పట్టుకున్నాడంట చంద్రన్న. చచ్చిపోతుందని అడనుకోలేదంట... కానీ... అది చచ్చిపోయింది".

వింటూనే వొణికిపోయింది గంగ. రేపేనాడైనా తనకీ అట్టాంటి గతి పట్టదని కచ్చితం ఎక్కడుంది?... అమ్మో! తల్చుకోడానికే బయం...

"ఇంకోటి తెల్సా? ఆ బవానికేమో ఏదో అంటురోగం అంటుకుందంట. దానేడుపుదాన్ది... డబ్బాశ ఎక్కువై మురికి కూపంలో దిగి బతుకు నాశనం చేసుకున్నానని తలబాదుకుంటోంది..."

"ఏంటే? ఏంటి నువ్వు పొద్దున్నే వొచ్చి బయపెట్టే ఈ మాటలు?" ఒక్కసారిగా ముంచుకొచ్చిన భయం... అయోమయం... దానికి తోడైన ఆవేశంతో సుబ్బి భుజాలు పట్టుకుని ఊపేసింది గంగ.

ఎర్రబడ్డ మొహం...

గుండెల్లోంచి కన్నుల్లోకి తన్నుకొస్తున్న ఆక్రోశం...

కింద కూలబడింది ఆ మట్టిలోనే.

గంగని ఎప్పుడూ అలా చూడలేదు సుబ్బి ఇంతవరకూ.

బెదురుగొడ్డులా చూస్తూ తానూ పక్కనే చతికిలబడింది.

"నువ్వాదినం అన్నది గుర్తుకొస్తున్నాది" ఎటో చూస్తూ చిన్నగా గొణిగిన గంగని ఏంటది అని అడగడానిక్కూడా నోరు పెగలక చూపులప్పగించి కూచుంది సుబ్బి.

"చిన్నపిల్ల ఆ గౌరి మనల్ని చూసి బెదురుగా ఉన్నదంటే నువ్వేవన్నావ్? అది మనకి ఎచ్చరికలా ఉన్నదన్నావు కదా? ఆ బగమంతుడే నీ చేత ఆ మాట అనిపించినాడేమో! నా కింక ఈ బతుకొద్దు... నీకూ?" గంగ కళ్ళల్లోని ఆక్రోశం మటు మాయమైంది. పశ్చాత్తాపానికి మారు రూపాలయ్యాయి ఆ కన్నులు.

"నాకూ వొద్దు..." తల అడ్డంగా ఊపుతూ టక్కున జవాబిచ్చింది సుబ్బి.

"దిన దినగండంగా మనవెందుకు బతకాల? దైర్నంగా తలెత్తుకు బతికే పన్లు చూసుకుందాం. రత్తాలు లాంటోళ్ళని మన చుట్టు పక్కలచేరకుండా తరివి కొట్టాల..."

"ఆ పని మనవల్ల ఏవవుతాది?"

"ఎందుక్కాదు? అందరం ఓ మాట మీద నిలబడితే ఏవైనా చెయ్యొచ్చు. ముందు మీ అమ్మా మా అమ్మా కూడా బుద్ధి తెల్సుకోవాల..."

"ఔను... తెలిసొచ్చేలా చెప్పుకుందాం".

"అదిగో... మంగమ్మ పిన్ని అటుపోతా ఉంది... పద పద... పిన్నమ్మకి చెప్పుకుందాం మన బాద..." గంగ వెనకే నడిచింది సుబ్బి, ఇద్దరూ కల్సి తమ గోడు వెళ్ళబోసుకున్నారు. మంగమ్మ ఎంత మంచి మనిషో వాళ్ళకే కాదు ఆ చుట్టుపక్కల ఇళ్ళల్లో అందరికీ తెలుసు.

"ఎవరో వొచ్చి మమ్ముల్ని కాపాడాలని ఎదురు చూడకుండా మేవే రొంపిలోంచి బయట పడాలనుకుంటున్నాం. గౌరి మాకంటే చిన్నపిల్లయినా తెలివైనపిల్ల. గుణమంతురాలు. దానిమాటే మాకు ఎచ్చరిక అయ్యింది" అంటూ ఆ రత్తాలు గౌరిని కూడా రొచ్చులోకి దింపాలనుకున్న ప్రయత్నం... గౌరి తప్పించుకున్న వైనం చెప్పింది గంగ. ఒక్కక్షణం గుండె కొట్టుకోడం ఆగిపోయినట్టయింది మంగమ్మకి... తన కూతురు పెద్ద గండంనించి తప్పించుకుందని మనసు కుదుట పరుచుకుంది. ఇంటివైపు నడుస్తున్నదల్లా వెనక్కి బజారువైపు దోవపట్టింది. కూతురిమీద నమ్మకం బతుకుబండిని లాగడానికి మరింత బలాన్ని ఇచ్చిందా తల్లికి.

✧ ✧ ✧

ఇంట్లో అడుగు పెడుతూనే గౌరిని కేకేసింది మంగమ్మ.

"మా గౌరి బంగారం... నా తల్లి మంచిది..." అక్కున చేర్చుకుని... తాను మనస్ఫూర్తిగా కొనుక్కొచ్చినది కూతురి చేతిలో పెట్టింది. అది చూస్తూనే గౌరి మనసు ఉబ్బితబ్బిబయింది. ఆనందంతో కళ్ళు మిలమిలలాడాయి. తన మదిని దోచిన ఆ రంగు రంగుల పూలగుత్తిని ముద్దుగా మురిపెంగా అపురూపంగా చూసుకుంటూ మురిసిపోతున్న ఆ చిన్నారి ముఖం విరిసిన పూబాల చందమే అయింది. నిలువెల్లా ఆ తనువు పూలగుత్తే అయింది.

సుజన రంజని, జూన్ 2011